## నూతన వధూవరులను ఆశీర్వదించిన హరీశ్‌రావు


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 18: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పలు వివాహాలకు హాజరయ్యారు. సిద్దిపేటలోని పటేల్ గార్డెన్, వీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్, రంగనాయక స్వామి ఫంక్షన్ హాల్, లావణ్యగార్డెన్, బాలాజీ గార్డెన్, చంద్రమౌళి గార్డెన్, కొండ భూదేవి గార్డెన్, పోలీస్ కన్వెన్షన్ హాల్, వయోలా గార్డెన్, నంగునూరు మండలం రాంపూర్ గ్రామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహాలకు హరీశ్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## పోచమ్మ ఉత్సవాలకు హరీశ్‌రావు రూ.50 వేల విరాళం

నారాయణరావుపేట, మే 18: మండలంలోని కొండంరాజుపల్లిలో ఆదివారం జరిగిన పోచమ్మ దేవాలయ ఉత్సవాల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ వార్షికోత్సవ సందర్భంగా రూ.50 వేల విరాళం ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు హరీశ్‌రావును సన్మానించారు. అనంతరం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరుగుతున్న పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఉంజేయలు, శంకర్, దేవయ్య పాల్గొన్నారు.


కొండంరాజుపల్లిలో ఆలయానికి విరాళం అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వానం


ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయాల ప్రతినిధులు

సిద్దిపేట, మే 18 : సిద్దిపేట నియోజకవర్గంలో పలు ఉత్సవాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆహ్వానించారు.. చిన్నకోడూరు మండలంలోని విఠలాపూర్‌లో 22 నుంచి 25 వరకు జరిగే పెద్దమ్మ ఉత్సవాలు, సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులో జూన్ 2 నుంచి, పొన్నాలలో 21 నుంచి ప్రారంభమయ్యే మహంకాళి దేవాలయ విగ్రహాల ప్రతిష్ఠ, 23 నుంచి ప్రారంభమయ్యే దుర్గామాత దేవాలయ ఉత్సవాలకు రావాలని ఆయా ఆలయాల ప్రతినిధులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

**అధైర్య పడొద్దు అండగా ఉంటా..**

సిద్దిపేట కమాన్, మే 18 : సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బలిగేల నర్సింహులు శనివారం తీవ్ర అనారోగ్యానికి గురై సిద్దిపేట పట్టణంలోని పీపుల్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దవాఖానకు వెళ్లి అతడిని పరామర్శించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు.

## హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

సిద్దిపేట, మే 18: రంగనాయకసాగర్ అతిథి గృహంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.సుధను కలెక్టర్ ఎం. మనుచౌదరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. శనివారం సరస్వతీ నదిపుష్కరాలకు కాళేశ్వరం వెళ్లిన ఆమె తిరుగు ప్రయాణంలో రంగనాయకసాగర్ అతిథి గృహానికి వచ్చారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాకు వచ్చిన న్యాయమూర్తిని శాలువాతో సన్మానించి చేర్యాల పెయింటింగ్ బహుమతిగా అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి, ఆర్డీవో సదానందం, ఏసీపీ మధు, న్యాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుధకు మొక్క అందజేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

## అర్హులకే 'రాజీవ్ యువవికాసం' అందించాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్‌టౌన్, మే 18: అర్హులకే 'రాజీవ్ యువవికాసం' అందించాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన పథకాన్ని అర్హులైన వారికే అందించాలని కోరారు. ప్రభుత్వం నిరుద్యోగులను మోసంచేస్తే బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తేలేదని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తున్నారని, ఇలాంటి చర్యలు మానుకోని పక్షంలో ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాములు, బీఆర్ఎస్ పట్టణయూత్ అధ్యక్షుడు మేకల వికాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## తండాలను జీపీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంద యాదగిరి

మద్దూరు(ధూళిమిట్ట), మే 18: తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. ఆదివారం హనమతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహారాజ్‌తండాలో ఈజీఎస్ నిధులు రూ. 5లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూక్యా జగన్, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్, జగన్, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత సన్మార్గంలో నడుచుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 18: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో నడుచుకోవాలని మద్దూరు ఎస్సై మహబూబ్ సూచించారు. శనివారం రాత్రి మద్దూరు మండలం మర్మాములలో పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించి వివిధ అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల వ్యవహార శైలిపై దృష్టిసారించాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి, పోలీస్ కళాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై మహబూబ్

**నేడు ఉచిత కంటి వైద్య శిబిరం**

మద్దూరు(ధూళిమిట్ట), మే 18: మద్దూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శంకర కంటి దవాఖాన హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మద్దూరు, లద్నూర్ పీహెచ్‌సీల వైద్యాధికారులు రజిత, సుధీర్‌రాజ్ తెలిపారు. కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# పెద్దచెరువు కట్టపై ఇక్కట్లు

- పెరిగిన సర్కారు తుమ్మచెట్లు
- ఇబ్బందులు పడుతున్న వాకర్స్
- కట్టకు మరమ్మతులు చేయాలని డిమాండ్


చేర్యాల పెద్ద చెరువు కట్టపై పెరిగిన సర్కారు తుమ్మ చెట్లు.. కట్టపై వాకింగ్ చేస్తున్న వాకర్స్

చేర్యాల, మే 18: పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై ప్రజలు, వాకర్లు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువుల పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ సర్కారు హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో పెద్ద చెరువుకు పూర్వ వైభవం వచ్చింది. చెరువును లోతుగా తవ్వి పూడిక తీసి చెరువుకట్టను బలోపేతం చేయడంతో పాటు వెడల్పు చేయడం, చెరువుకు ఇరువైపులా ఉన్న సర్కారు తుమ్మ చెట్లను తొలిగించారు. ఏటా చెరువులోకి గోదావరి జలాలు విడుదల చేయడంతో పట్టణ ప్రజలకు నీటి తిప్పలు తప్పాయి. చెరువుకు పూర్వ వైభవం రావడం, పెద్ద చెరువు కట్ట వెడల్పు కావడం, చెట్లు తొలిగించడంతో పాటు పట్టణ ప్రజలు, రైతులు, వాహనదారులు కట్టను ఉపయోగించుకుంటున్నారు. వీరితో పాటు వాకర్స్ నిత్యం చెరువు కట్ట పై కొన్నేండ్లుగా వాకింగ్ చేస్తున్నారు.పెద్ద చెరువు కట్ట పై మున్సిపాలిటీ అధికారులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో నిత్యం వేకువజామున, సాయంత్రం కట్టపైకి యువకులు, పెద్దలు వెళ్లి వినియోగించుకుంటున్నారు. కొన్ని మాసాలుగా చెరువు కట్టకు ఇరువైపులా సర్కారు తుమ్మచెట్లు ఏపుగా పెరిగిపోవడంతో వాహనదారులతో పాటు వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. వాకింగ్ చేసే వారు కట్ట పై నడుస్తున్న సమయంలో ఏమైనా వాహనాలు వస్తే వెంట నే వారు పక్కకు జరిగే సమయంలో తుమ్మ చెట్లు వారికి తగులుతున్నాయి. దీనికితోడు కట్టపై పగుళ్లు రావడం, కంకర తెలిఉండడంతో వాకింగ్ చేస్తున్నవారు గాయాలపాలవుతున్నారు. చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న సర్కారు తుమ్మ చెట్లను తొలిగించి, కట్టపై భాగంలో మొరంపోస్తే వాకర్స్‌తో పాటు అటువైపు వెళ్లే రైతులు, వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న సర్కారు తుమ్మ చెట్లను తొలిగించి మరమ్మతులు చేయాలని పెద్ద చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం**



పెద్దచెరువు కట్టపై వాకింగ్ చేస్తున్న సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నా యి. ప్రధాన రహదారి పక్కనే వాకింగ్ చేద్దామనుకుంటే రోడ్డుపై ట్రాఫిక్ పెరిగిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో చెరువు కట్టపై వాకింగ్ చేస్తున్నాం. కొన్ని నెలలుగా చెరువు కట్టకు ఇరువైపులా సర్కారు తుమ్మ చెట్లు పెరిగిపోవడంతో వాకింగ్‌కు ఇబ్బందిగా మారింది. వాహనాలు వచ్చిన సమయంలో పక్కకు జరిగితే చెట్లు తలకు తాకుతున్నాయి.అధికారులు స్పందించి సర్కారు తుమ్మచెట్లను తొలిగించడంతో పాటు కట్టపై మట్టిపోస్తే ఇబ్బందులు తొలిగిపోతాయి.

– పరశురామ్, వాకర్, చేర్యాల

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రసమయి

బెజ్జంకి, మే 18: మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ వద్ద మాజీ సర్పంచ్ టేకు తిరుపతి కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, తిరుపతి, రాజయ్య, మల్లేశం, సంజీవరెడ్డి, బాలనర్సు, మోహన్, రాజు ఉన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## పేదింటి అమ్మాయి పెండ్లి చేసిన అలయన్స్ క్లబ్

సిద్దిపేట టౌన్, మే 18: సిద్దిపేట అలయన్స్ క్లబ్ సేవా నిరతిని చాటుతూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నది. వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట పట్టణానికి చెందిన మన్నెమ్మ, ఎల్లప్ప దంపతులు దిన సరి కూలీగా పనిచేస్తున్నారు.వీరికి పెండ్లీడుకొచ్చిన కూతురు సంధ్య ఉంది. కడు పేదరికంలో ఉన్నామని తమ కూతురు వివాహానికి సహాయం చేయాలని క్లబ్ గవర్నర్ ఈశ్వర్ చరణ్‌కు విన్నవించారు. దీంతో ఆయన స్పందించి సంధ్య వివాహం తామే చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక కోటిలింగాల ఆలయంలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు సంధ్య వివాహాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ గవర్నర్ గందె ఈశ్వర్ చరణ్, క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మరాములు మాట్లాడుతూ.. అలయన్స్ క్లబ్ పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మపర్సన్ మంజుల, అంజయ్య, అంతయ్య, వైకుంఠం, బాలచంద్రం పాల్గొన్నారు.


నిరుపేద వధువు పెండ్లి చేసిన అలయన్స్ క్లబ్ సభ్యులు

## ఆలయ గోపురం నిర్మాణానికి విరాళం

నంగునూరు, మే 18: మండల కేంద్రంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించే మహంకాళి అమ్మవారి ఆలయ గోపురం నిర్మాణానికి ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. అనంతరం నల్లపోచమ్మ, ఎల్లమ్మ, మహంకాళి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సంకల్పానికి దైవ సహాయం ఎంతో అవసరమన్నారు. అందరికీ సహాయ సహకారాలు అందించడానికి కృషిచేస్తానన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


వంగ రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

## బెల్లం, పట్టిక లారీ పట్టివేత

హుస్నాబాద్‌టౌన్, మే 18: గుడుంబా తయారీ కోసం తీసుకువస్తున్న బెల్లం, పట్టిక లారీని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్రలోని కేడ్గవానుంచి హుస్నాబాద్‌కు వస్తున్న లారీని శనివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. లారీలో ఎనిమిదివేల కిలోల బెల్లం, 200 కిలోల పట్టికను గుడుంబా తయారీ కోసం తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని కవిత ట్రేడర్స్‌కు చెందిన వెంకటేశ్‌తోపాటు హుజురాబాద్, కరీంనగర్‌కు చెందిన వ్యాపారుల కోసం బెల్లం, పట్టిక తరలిస్తున్నట్లు లారీడ్రైవర్ ఒప్పుకున్నాడని సీఐ చెప్పారు. బెల్లం, పట్టికను తరలిస్తున్న డ్రైవర్‌తో పాటు వ్యాపారులపై సైతం కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. లారీని పట్టుకునేందుకు కృషిచేసిన కానిస్టేబుల్ రాజును అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముర్ఫి, సీఐ పవన్ అభినందించారు. ఇందులో ఎక్సైజ్ ఎస్సై రూప, సిబ్బంది రాజమల్లారెడ్డి, ఖలీక్, రాజు, సతీశ్ పాల్గొన్నారు.


హుస్నాబాద్‌లో బెల్లం, పట్టిక లారీని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

## కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర

సిద్దిపేట కమాన్, మే 18: భజనలు.. భక్తి పాటలు.. మంగళహారతులతో హనుమాన్ స్వాముల పాదయాత్ర ఆదివారం ప్రారంభమైంది. సిద్దిపేట కోటిలింగాల ఆలయం నుంచి కొండగట్టుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 100 మంది హనుమాన్ స్వాములు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. హనుమాన్ స్వామి సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో ప్రారంభమైన పాదయాత్రకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆదివారం రాత్రి సిద్దిపేట సమీపంలోని పెద్దమ్మ గుడివద్ద స్వాములు నిద్రిస్తారు. సోమవారం ఉదయం మళ్లీ పాదయాత్ర మొదలై బుధవారం రాత్రి స్వాములు కొండగట్టుకు చేరుకుంటారు.



సిద్దిపేట నుంచి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్‌స్వాములు

## ఉచిత కంటి వైద్య శిబిరం సక్సెస్

కొమురవెల్లి, మే 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో విడత ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. మండల వ్యాప్తంగా 160 మంది వైద్య శిబిరానికి హాజరుకాగా వారందరికీ వైద్య పరీక్షలు చేయడంతో పాటు శస్త్ర చికిత్స అవసరమగు 65 మందిని హైదరాబాద్‌లో శంకర కంటి దవాఖానకు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న మండల ప్రజలు

## వర్గల్ ఆలయాల్లో భక్తుల పూజలు

వర్గల్, మే 18: వర్గల్ విద్యా సరస్వతీ ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి ఆలయాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. నాచగిరి నరసింహ స్వామి క్షేత్రంలో భక్తులు పెద్ద సంఖ్యలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. వర్గల్ వేణుగోపాలస్వామి దేవస్థానంలో నేడు జరిగే విమాన రథోత్సవం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు. వేణుగోపాల స్వామిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, కాంగ్రెస్ జిల్లా యూత్ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


నాచగిరిలో సత్యనారాయణ వ్రతాలు జరిపిస్తున్న భక్తులు

## మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

చేర్యాల, మే 18: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సుమారు 15 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో ఎస్.అన్నపూర్ణ తెలిపారు.శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టడంతో పాటు మరికొందరు భక్తులు స్వామి వారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రల్లో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణలు,కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్,పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, మల్లన్న ఆలయ పాలక మండలి డైరెక్టర్లు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.


కొమురవెల్లిలో భక్తుల కోలాహలం

## రేణుకా ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

హుస్నాబాద్‌టౌన్, మే 18: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకాఎల్లమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్నారు. ఆలయ మండపంలో పట్నాలు, ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. భక్తజనం పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఎల్లమ్మ ఆలయ ఆవరణం నిండిపోయింది. అమ్మవారికి గొర్లు, మేకలు, కోళ్లు సమర్పించేందుకు భక్తులు పోటీపడ్డారు. భారీగా జనం తరలిరావడంతో ఆలయ పరిసరాల్లోని చెట్ల కిందనే వంటలు చేసుకుని బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.


ఆలయ ఆవరణలో పట్నంవేసి కథ చెబుతున్న బైండ్ల పూజారులు

## కొనసాగుతున్న ఆలయ స్వర్ణోత్సవాలు

సిద్దిపేట టౌన్, మే 18: సిద్దిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ స్వర్ణోత్సవాలు కొనసాగుతున్నాయి. చినజీయర్‌స్వామి ప్రత్యేక్ష పర్యవేక్షణలో జరుగుతున్న వేడుకల్లో భాగంగా ఆదివారం దేవాలయంలో స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, యాగశాల ప్రవేశం, ఆరాధన మహోత్సవాలు, ధ్వజారోహణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం

## సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

మర్కూక్, మే 18: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని మాజీ ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. మండలంలోని పాములపర్తికి చెందిన బైండ్ల మహేశ్ అనారోగ్యంతో ప్రైవేట్ దవాఖానలో చేరారు. సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.32500 వేలు మంజూరయ్యారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్ల మహేశ్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పాండుగౌడ్

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బెజ్జంకి, మే 18: మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాలలో 2002–03 టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బేగంపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

## పీఏసీఎస్ చైర్మన్‌కు పితృవియోగం

చేర్యాల, మే 18: కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు మెరుగు శ్రీనివాస్, చేర్యాల, కొమురవెల్లి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణాగౌడ్‌కు పితృవియోగం కలిగింది.ఇరువురు నాయకుల తండ్రి మెరుగు నర్సయ్యగౌడ్(70) అనారోగ్యానికి గురై ఆదివారం వేకువజామున సిద్దిపేటలో మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంత్యక్రియలు ఐనాపూర్‌లో నిర్వహించడంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని వర్గాల ప్రజలు హాజరయ్యారు. మృతుడు నర్సయ్యకు నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

## మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు

హుస్నాబాద్‌టౌన్, మే 18: హుస్నాబాద్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం డీఎంఎఫ్‌టీ నుంచి రూ. 30.80లక్షలు మంజూరైనట్లు బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని పోతారం (ఎస్) పాఠశాల ప్రహరీ, టాయిలెట్స్ నిర్మాణానికి రూ. 16.80లక్షలు, తోటపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 14 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

## పేదింటి ఆడబిడ్డకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కనకయ్య

మర్కూక్, మే 18: పేదింటి ఆడబిడ్డకు తన వంతు ఆర్థిక సాయం చేసినట్లు బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని పాములపర్తికి చెందిన దర్శనాల కవిత కనకయ్య కూతురు స్పందన పెండ్లికి ఆయన రూ.5000 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పిట్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే18: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలని ధూళిమిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ అధికారులకు సూచించారు. ఆదివారం ధూళిమిట్టలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి కొనుగోళ్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాలు ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. హమాలీల కొరతతో కొంత జాప్యం జరుగుతుందని, దీనిపై వారితో ప్రత్యేకంగా మాట్లాడి కాంటాలు పెట్టిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఫయిమ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ యజ్ఞం

మద్దూరు(ధూళిమిట్ట), మే18: మద్దూరు మండలం నర్సాయపల్లిలో హనుమాన్ దీక్ష ఆచరించిన స్వాముల ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, మన్యసూక్త పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, భజన నిర్వహించారు. తీర్థప్రసాద వితరణ చేశారు. అనంతరం స్వాములు ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని సామూహికంగా ఊరేగించారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

## పరిస్థితి విషమించి చిన్నారి మృతి


అనబియా(ఫైల్)

వర్గల్, మే18: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి 14 ఏండ్ల చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని నాచారంలో చోటుచేసుకుంది. గౌరారం ప్రొబేషనరి ఎస్సై కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం .. హర్యానా రాష్ట్రానికి చెందిన షోయబ్ ఖాన్ నాలుగు నెలలుగా నాచారం గ్రామానికి చెందిన ఉంగరాల నర్సింహులు వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం అతడి కూతురు అనబియా (14 నెలలు) జేసీబీ వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఆటబొమ్మ పిన్నును నోట్లో పెట్టుకోగా అది గొంతులో ఇరుక్కుంది. దీంతో అనబియా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడటంతో ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానకు తీసుకువెళ్లగా చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. మృతురాలి తండ్రి షోయబ్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.